

కలెక్టరేట్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు



వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

# ఒడిదొడుకులను ఎదుర్కోవాలి

- కలెక్టర్ పమేలా సత్పతి
- ఘనంగా జాతీయ సమైక్యతా దినోత్సవం



జాతీయ సమైక్యతా దినోత్సవం లో పాల్గొన్న వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు, రావెప్ విద్యార్థులు

కలెక్టరేట్, అక్టోబర్ 31: ఉద్యోగులు విధి నిర్వహణలో ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా సమర్థవంతంగా ఎదుర్కొన్నప్పుడే సరైన గుర్తింపు లభిస్తుందని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జాతీయ సమైక్యతా దినోత్సవంలో ఆమె మాట్లాడారు. విధి నిర్వహణలో ఎదురయ్యే ఒడిదొడుకులు సర్వసాధారణమని, వాటిని ఎప్పటికప్పుడు ఎదుర్కొంటూ నిష్పక్షపాతంగా వ్యవహరించినప్పుడే చేస్తున్న ఉద్యోగానికి సరైన న్యాయం చేసినవారమవుతామని పేర్కొన్నారు. చేయబోయే ప్రతి పనిని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహిస్తూ, సమష్టి కృషితో విజయవంతం చేసి, జిల్లాకు మంచిపేరు తెద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, డీఆర్వో పవన్‌కుమార్, ఆర్డీవో మహేశ్వర్, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### వివేకానంద కళాశాలలో..

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 31: జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో జాతీయ సమైక్యతా దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ దేశ సమైక్యతా, సమగ్రత కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఆర్ గోపీకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థులు సమైక్యతను పెంపొందించుకుంటూ, దేశభద్రతకు ప్రతిన బూనాలన్నారు. అనంతరం విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, అధ్యాపకులు జాతీయ సమైక్యతా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కచ్చు సతీశ్‌కుమార్, సంపత్ కుమార్, శ్రావణ్ కుమార్, రామేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే, నగరంలోని ఎస్సారార్ కళాశాలలో యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, శాతవాహన విశ్వవిద్యాలయం ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజయ్య, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వీ వరప్రసాద్, డీడీ నాయుడు, బీ సురేశ్ కుమార్, చంద్రమౌళి, శారద, తదితరులు పాల్గొని జాతీయ సమైక్యతా ప్రతిజ్ఞ చేశారు.

### వ్యవసాయ పరిశోధన స్థానంలో..

ముకరంపుర, అక్టోబర్ 31: కరీంనగర్‌లోని వ్యవసాయ పరిశోధన స్థానం, ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జీ మంజులత, శాస్త్రవేత్తలు, రావెప్ విద్యార్థులు, సిబ్బందితో ఐక్యతా ప్రతిజ్ఞ చేశారు. శాస్త్రవేత్తలు శ్రావణి, ఉషారాణి, పీ మధుకర్ రావు, మదన్‌మోహన్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, ప్రియదర్శిని, సిరిసిల్ల వ్యవసాయ కళాశాల పరిపాలన సిబ్బంది, ఏఈవోలు, పరిశోధన స్థానం సిబ్బంది, కార్మికులు, రావెప్ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.





కలెక్టర్ పమేలా సత్పతికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న టీఎన్జీవోస్, ఎంపీడీవోల సంఘం నాయకులు

# కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ

కొత్తపల్లి/కరీంనగర్‌రూరల్, అక్టోబర్ 31 : కరీంనగర్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పమేలా సత్పతిని మంగళవారం వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతిని మాట్లాడుతూ, ఉద్యోగులకు సంబంధించిన న్యాయపరమైన ఏ సమస్యలున్నా పరిష్కారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, అసోసియేట్ అధ్యక్షుడు రాగి శ్రీనివాస్, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, మహిళా నాయకులు ఇరుమల్ల శారద, సబిత, సునీత, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రామస్వామి, నర్సింహారెడ్డి, గూడ ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే, కలెక్టర్ పమేలా సత్పతిని ఎంపీడీవోల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నీలగిరి దివ్యదర్శన్‌రావు, ఎడబోయిన శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చింతల రవీందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్డీవో శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా ఎదుర్కోలు ఉత్సవం

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 31: నగరంలోని యజ్ఞవరాహస్వామి ఆలయంలో జరుగుతున్న 17వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఎదుర్కోలు ఉత్సవం అట్టహాసంగా నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం హిరణ్యాక్షున్ని వరాహస్వామి సంహరించే లీల కనుల పండువగా నిర్వహించారు. రాత్రి శేషవాహనంపై యోగనరసింహస్వామి రూపంలో శ్రీవారు ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ కనువిందు చేశారు. ఈ కార్యక్రమంలో సర్వవైదిక సంస్థానం ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



ఆలయ ఆవరణలో పూజలు చేస్తున్న పండితులు

## యశోద దవాఖానలో అరుదైన చికిత్స



మాట్లాడుతున్న వైద్యుడు మోహనకృష్ణ, పక్కన వైద్యుడు మాధవ్‌దంతాల

- జన్యుపరమైన లోపాన్ని గుర్తించిన వైద్యులు
- పది రోజుల్లోనే సాధారణ స్థితికి వచ్చిన బాధితుడు

విద్యానగర్, అక్టోబర్ 31: పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం గట్టెపల్లికి చెందిన సంపత్‌కుమార్ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత మే 18న పొలంలో ట్రాక్టర్‌తో దున్నుతుండగా అకస్మాత్తుగా కుడికాలు బలం తగ్గి బ్రేకులు వేయడం ఇబ్బందిగా మారడంతో వెంటనే ఇంటికి వెళ్లాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ దవాఖానకు తీసుకెళ్లారు. అప్పటికే కుడికాలు, కుడి చేతిలో బలం తగ్గిందని వైద్యులు గుర్తించి రెండు రోజులు చికిత్స అందించినప్పటికీ నయం కాకపోవడంతో హైదరాబాద్‌లోని యశోద దవాఖానకు తరలించారు. వైద్యుడు న్యూరో ఫిజీషియన్ మోహనకృష్ణ సంపత్‌ను పరీక్షించి కేవలం నడుం కింది భాగం పని చేయకపోవడంతో రక్త పరీక్షలో హిమోగ్లోబిన్ 21గా ఉన్నట్లు గుర్తించారు. మామూలుగా అయితే 12 నుంచి 16 గ్రాములు ఉండాల్సిన హిమోగ్లోబిన్ ఎందుకు ఎక్కువగా ఉందని అదే దవాఖానలో హిమటాలజిస్టుగా పని చేస్తున్న మాధవ్ దంతాలకు కేసును రెఫర్ చేశారు. వెంటనే వైద్యులు బోన్ మ్యారోతో పాటు పాలిసైథిమియా వెరా, జాక్ 2 మ్యూటేషన్ అనే అరుదైన జన్యుపరమైన రక్త సమస్యతో సంపత్ శరీరంలో రక్తం చిక్కబడి మెదడులో రక్తం గడ్డ కడుతున్నట్లు గుర్తించారు. వెంటనే సంపత్ శరీరం నుంచి రక్తాన్ని తొలగించి అవసరమైన మందులను ఇవ్వడంతో పది రోజుల్లోనే కాళ్లలో కదలికలు వచ్చాయి. శరీరానికి కావాల్సిన రక్తాన్ని తగిన మోతాదులో అందించడంతో పూర్తి స్థాయిలో సంపత్ కోలుకున్నట్లు వైద్యులు పేర్కొన్నారు. ఏ అనారోగ్య సమస్యనైనా ప్రాథమిక దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. యశోద దవాఖానలో 24 గంటల పాటు వైద్యులు అత్యాధునిక వైద్య పరికరాలతో వైద్య సేవలందిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## వాసవి క్లబ్స్ జిల్లా గవర్నర్‌గా మాధవి



ప్రమాణ స్వీకారం చేస్తున్న మాధవి

విద్యానగర్, అక్టోబర్ 31: వాసవి క్లబ్స్ జిల్లా గవర్నర్‌గా జంధ్యం మాధవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు నగరంలోని పద్మావతి గార్డెన్‌లో జరిగిన జిల్లా వార్షిక సమావేశంలో 2024 సంవత్సరానికి గానూ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని క్లబ్‌లను సమన్వయపరిచి నిరుపేదలు, నిస్సహాయులను ఆదుకునేందుకు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. మాధవికి ఐఈసీ, ఐజీబీ, క్యాబినెట్ అధికారులు పబ్బా అరుణ, ఎల్లెంకి ప్రదీప్, జైన అర్చన, సూర గీత, రాచమల్ల గాయత్రి, అల్లెంకి లింగమూర్తి, రజిత, యాంసాని రమాదేవి, డాక్టర్ ఎలగందుల సౌమ్య, తదితరులు శుభాకాంక్షలు తెలిపి, గజమాలతో సత్కరించారు.

## రాష్ట్రస్థాయి జూడో పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల చైర్మన్ కడారి అనంతరెడ్డి, తదితరులు

కొత్తపల్లి, అక్టోబర్ 31: హన్మకొండ జిల్లాలో ఈ నెల ఒకటి నుంచి 3వ తేదీ వరకు జరిగే 67వ రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్-14 బాలబాలికల జూడో చాంపియన్‌షిప్ పోటీలకు కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల విద్యార్థులు బింగి మన్విత, ఈశ్వర్, ఎల్ మల్లేశ్ ఎంపికైనట్లు పీఈటీ సిలివేరి మహేందర్ తెలిపారు. పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను మానేరు విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని సూచించారు. విద్యార్థులను మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, పీఈటీలు, ఉపాధ్యాయులు అభినందించారు.